సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



భూ భారతితో..
గోపాల్‌పేట, మీసాన్‌పల్లిలలో నిర్వహించిన భూ భారతి సదస్సులలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు.
- IIలో ▸



నిరుపేదలకు ప్రాధాన్యత..
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ సూచించారు.
- IIలో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
41.5 /22.2
ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ శాతం తగ్గుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘దోషులకు శిక్ష పడేలా చూడాలి’



కామారెడ్డి క్రైం: కేసులలో దోషులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో కోర్టు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ మొదలుకొని చార్జిషీట్, సాక్షులను ప్రవేశపెట్టడం వరకు అన్ని రకాల కోర్టు విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి క్రైం: విధుల్లో నిర్లక్ష్యాన్ని కనబరిచినందుకు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల ఎస్పీ రాజేశ్ చంద్ర తాడ్వాయి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎస్సై వెంకటేశ్వర్లు అందుబాటులో లేరు. ఎక్కడికి వెళ్లారన్న విషయమై సిబ్బంది సరైన సమాధానం ఇవ్వలేదు. అనంతరం ఎల్లారెడ్డిలో పర్యటించిన ఎస్పీ.. కామారెడ్డికి తిరిగి వస్తూ తాడ్వాయి పీఎస్‌ను మరోసారి సందర్శించారు. అప్పుడు కూడా ఎస్సై లేకపోవడంతో వాకబు చేయగా.. సీఐకిగాని, డీఎస్పీకి గాని సమాచారం ఇవ్వకుండా స్థానికంగా అందుబాటులో లేరని తెలిసింది. సదరు ఎస్సై వ్యవహారంపై విచారణ జరపగా స్థానికంగా సరిగా అందుబాటులో ఉండరని తేలింది. దీంతో శాఖాపరమైన చర్యలకు ఎస్పీ ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో విధుల్లో నిర్లక్ష్యం కనబరిచిన ఎస్సైని సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వరిధాన్యం తూకాలు ప్రారంభం



సాక్షి స్పందన

నిజాంసాగర్: నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లోని మల్లూర్, మహమ్మద్‌నగర్ గ్రామాల్లో శనివారం వరి ధాన్యం తూకాలను ప్రారంభించారు. ‘వడ్లు కొనేదెప్పుడో’ శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు.. వెంటనే కాంటాలకు చర్యలు తీసుకున్నారు. రెండు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని కాంటా వేయించారు. మిగిలిన గ్రామాల్లో రెండు, మూడు రోజుల్లో తూకాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్‌నగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి నవ్య, సొసైటీ సీఈవోలు చింతరాములు సేట్, సాయిలు పాల్గొన్నారు.

350 ఎకరాల్లో నష్టం

బీబీపేట: మండల కేంద్రంతో పాటు యాడారం, మల్కాపూర్, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు సుమారు 350 ఎకరాల్లో వరి, మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి నరేంద్ర తెలిపారు. అధికారులు శనివారం ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించారు. కోళ్ల ఫారాల పైకప్పులు లేచిపోవడంతో పౌల్ట్రీ రైతులూ నష్టపోయారన్నారు. ఏవో వెంట ఏఈవో రాఘవేంద్ర తదితరులున్నారు.

‘మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి’

కామారెడ్డి క్రైం: యువత మత్తు పదార్థాలకు, కల్తీ కల్లుకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు సూచించారు. ఈ విషయమై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కల్తీకల్లు, మత్తుపదార్థాల కారణంగా కలిగే దుష్ప్రభావాలపై శనివారం జిల్లావ్యాప్తంగా 22 మండలాల పరిధిలో 86 గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించామన్నారు. మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేసినా, విక్రయించినా 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు, పారితోషికం అందిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



రారండోయ్.. కేకులు కోద్దాం

అంగ్ల నూతన సంవత్సరమో.. పుట్టిన రోజో.. ఎంగేజ్‌మెంటో.. పెళ్లో.. పెళ్లి రోజో.. సందర్భమేదైతేనేం వేడుక చేసుకోవాల్సిందే. కేక్ ఉండాల్సిందే.. చదువులో ఉత్తమ ఫలితాలు సాధించినా.. ఉద్యోగం పొందినా.. ప్రమోషన్ వచ్చినా.. లక్ష్యాన్ని చేరుకున్నా.. అభినందనలు అందుకున్నా.. ఏ ‘డే’ వచ్చినా.. కేక్ కోయాల్సిందే.. సామాజిక మాధ్యమాల ప్రభావంతో ఆచార వ్యవహారాలతోపాటు ప్రజల ఆహారపు అలవాట్లూ మారుతున్నాయి. ప్రస్తుతం వేడుక ఏదయినా కేక్ కోయడం మాత్రం కామన్‌గా మారిపోయింది.

సందర్భమేదైనా సంబురానికి ప్రతీకగా..
- కొత్త సంవత్సరం వేడుకలు కేకులతోనే మరూ
- పుట్టిన రోజుకు కిలోలకొద్దీ...
- ఎంగేజ్‌మెంట్, పెళ్లి, పెళ్లిరోజు వేడుకల్లోనూ తప్పనిసరి

సండే స్పెషల్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సామాజిక మాధ్యమాల ప్రభావం ప్రతీదానిపైనా కనబడుతోంది. ఆచార, వ్యవహారాలతో పాటు ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయి. ఇదే సమయంలో తిన్న తిండి నుంచి చేసే ఫంక్షన్ దాకా ప్రతీది స్మార్ట్ ఫోన్లో బంధించి బంధువులు, స్నేహితులకు షేర్ చేసి ఆనందం పొందుతున్నారు. ఇదే సమయంలో ప్రతి వేడుకలో కేక్ కట్ చేయడం అనేది కామన్ అయిపోయింది. అది పుట్టిన రోజైనా, పెళ్లి రోజైనా, కొత్త సంవత్సరం వేడుకలైనా.. కేక్ కోయాల్సింది. ఎంగేజ్మెంట్ సమయంలో జంటగా కేక్ కట్ చేస్తున్నారు. పెళ్లిలోనూ కేక్ తెచ్చి కోస్తున్నారు. మదర్స్‌డే, ఫాదర్స్ డే, ఉమెన్స్ డే, టీచర్స్ డే.. ఇలా ప్రతి అకేషన్‌లో కేక్ కట్ చేయడం ఆనవాయితీగా మారింది. పిల్లల బర్త్ డే వేడుకల్లో కేకులు తప్పనిసరి. అయితే ఈ మధ్య అన్ని వయసుల వారూ కేక్ కట్ చేస్తున్నారు. దోస్తులు కేక్ తయారు చేయించి వెంట తీసుకెళ్లి కట్ చేయించడం, తరువాత విందులు చేసుకోవడం ఫ్యాషన్‌గా మారింది. ఒక్కోసారి స్థాయిని బట్టి కిలోల కొద్దీ కేక్ కట్ చేస్తున్నారు. కొన్ని చోట్ల బర్త్ డే సందర్భంగా పదుల సంఖ్యలో కేక్‌లు కట్ చేస్తున్నారు. నవతరం అయితే రోడ్ల మీద కేక్‌లు కట్ చేయడం, కేకును బర్త్ డే చేసుకుంటున్న యువకుడి ముఖానికి రుద్దుతూ ఎంజాయ్ చేస్తున్నారు. కాగా చాలా వేడుకల్లో కేక్ కట్ చేసి వృథా చేస్తున్నారు. నాణ్యమైన కేకులు కొనుగోలు చేసిన వారు దాన్ని ముక్కలు చేసి తలా కొంత తినాల్సింది పోయి పక్కన పడేస్తున్నారు. వేడుక ముగియగానే కేకులు చెత్తబుట్టలపాలవుతుండడం విస్మయం కలిగిస్తోంది.


కేకులను చూపిస్తున్న బేకరీ నిర్వాహకుడు

ఏడాదంతా అమ్మకాలు...
ప్రతి వేడుకలో కేక్ కట్ చేస్తుండడంతో ఏడాది పొడవునా కేకులు అమ్ముతున్నారు. రకరకాల డిజైన్లలో తయారు చేస్తున్నారు. దుకాణాలు, వ్యాపారాలు, ఉద్యోగాల వార్షికోత్సవాల సందర్భంలోనూ కేక్‌లు కట్ చేస్తున్నారు. గతంలో పట్టణాలు, నగరాల్లో మాత్రమే కేక్‌లు దొరికేవి. ఇప్పుడు మండల కేంద్రాలు, మారుమూల గ్రామాలకూ బేకరీలు విస్తరించాయి. ప్రతిచోటా కేకులు లభ్యమవుతున్నాయి. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సమయంలో అయితే ఎక్కడ చూసినా కేకుల అమ్మకాలు కనిపిస్తాయి.

ఎంతో మందికి ఉపాధి...
కేకుల తయారీ నుంచి విక్రయాల దాకా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. గతంలో కొద్దిమంది మాత్రమే కేకులు కొనుగోలు చేసేవారని, ఇప్పుడు అన్ని వర్గాల వారు కేకులు కొంటున్నారని విక్రయదారులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో అయితే ప్రతిరోజూ వందలాది కేకులు అమ్ముడుపోతున్నాయి. దీంతో కేకుల తయారీ వర్కర్లకు ఉపాధి దొరుకుతోంది. బేకరీలు నిర్వహించే వారికి దందా నడుస్తోంది. దీనికి తోడు ఇటీవలి కాలంలో ఇంటి వద్ద కేకులు తయారు చేసి అమ్ముతున్నారు. కరోనా కాలంలో బర్త్ డే వేడుకలు, మ్యారేజ్‌డేలకు ఇంట్లోనే కేకులు సొంతంగా తయారు చేసుకున్నారు. అప్పటి నుంచి ఇంట్లోనే తయారు చేసుకోవడం అలవాటుగా మారింది.

ఆనవాయితీగా మారింది

ప్రతి శుభాకార్యానికి కేక్‌ను కట్ చేసుకుని సంబురాలు చేసుకోవడం ఆనవాయితీగా మారింది. జన్మదినం, వివాహం, ఎంగేజ్‌మెంట్, స్పెషల్ డేలకు తప్పకుండా కేక్ కట్ చేస్తున్నారు. గతంలో జన్మదిన వేడుకలకు మాత్రమే కేక్ కట్ చేయడం చూశాం. ఇప్పుడు అన్నింటికి తప్పనిసరిగా మారింది.
– గాండ్ల కృష్ణ, కామారెడ్డి

సిద్ధంగా ఉంచుతున్నాం..

ఒకప్పుడు జన్మదినానికి మాత్రం ముందుగా ఆర్డర్ ఇస్తే కేక్ తయారు చేసి ఇచ్చేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రతి శుభకార్యానికి కేక్ కట్ చేస్తున్నారు. దీంతో ఎప్పుడంటే అప్పుడు 2 నిమిషాల్లోనే కేక్‌లను ఇచ్చేస్తున్నాం. చాలా రకాల కేక్‌లను తయారు చేసి సిద్ధంగా ఉంచుతున్నాం.
– నరేశ్, బేకరీ యజమాని, కామారెడ్డి

ప్రతి అకేషన్‌కు..

పెళ్లి రోజైన, పుట్టిన రోజైనా మా ఇంటివాళ్లు, మా ఫ్రెండ్స్ అందరం కలిసి కేక్ కట్ చేస్తాం. మా ఫ్రెండ్స్ అందరి పుట్టిన రోజు నాడు నేను కేక్ తీసుకెళ్లి వారితో కట్ చేయిస్తాను. ఆ రోజంతా అందరం కలిసి ఎంజాయ్ చేస్తాం.
– సక్కర్లవార్ నరేశ్, మద్నూర్

పిల్లల బర్త్‌డేకు తప్పనిసరి

పిల్లల బర్త్‌డేకు తప్పనిసరిగా మేం కేక్ కట్ చేస్తాం. పిల్లలు వారి ఫ్రెండ్స్ ఆహ్వానిస్తారు. చాలా ఆనందంగా గడుపుతారు. అలాగే మా ఫ్రెండ్స్‌ను కూడా బర్త్‌డేలకు ఆహ్వానిస్తాం. మ్యారేజ్ డేకు కూడా కేక్ కట్ చేస్తాం.
– వంగపల్లి వైష్ణవి, మద్నూర్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం
- భూ భారతి ప్రత్యేకాధికారి రాజేందర్


బాయింపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న రాజేందర్

లింగంపేట : ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని భూ భారతి ప్రత్యేకాధికారి రాజేందర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాయంపల్లి, కన్నాపూర్ గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించారు. బాయంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్ మాట్లాడారు. రైతులకు భూ భారతి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. రైతులు తమ సమస్యలను దరఖాస్తులో స్పష్టంగా రాసి అధికారులకు అందించాలని సూచించారు. పథకం అమలు తీరు, పథకంలో ఏ ఏ సమస్యలు పరిష్కారం అవుతాయో వివరించారు. సదస్సుల్లో ఈనెల 30వ తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆ తర్వాత జూన్ 2వ తేదీ వరకు రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 30 రోజుల్లో పరిష్కారం కాని సమస్యలను ఆర్డీవో, కలెక్టర్ పరిధిలో పరిష్కరిస్తామన్నారు. అప్పటికీ పరిష్కారం కానివాటిపై ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య భూ వివాదాలపై సంయుక్తంగా సర్వే చేసి పరిష్కార మార్గాలు సూచిస్తామన్నారు. కోర్టు కేసులు ఉంటే తమ దృష్టికి తెస్తే సాధ్యమయ్యేవి అయితే అమ్మిన వారికి, కొన్న వారికి నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. బాయంపల్లిలో 86 దరఖాస్తులు, కన్నాపూర్ గ్రామంలో 74 దరఖాస్తులు వచ్చాయన్నారు. బాయంపల్లిలో 19 సర్వే నంబరులో 50 మంది రైతులకు చెందిన 408 ఎకరాలు, 75 సర్వే నంబరులో 25 మందికి సంబంధించిన 135 ఎకరాలు సీలింగ్ భూములుగా నమోదై ఉన్నట్లు రైతులు తన దృష్టికి తెచ్చారన్నారు. వాటిని విచారించి పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఉపతహసీల్దార్ రాందాస్, ఎఫ్ఆర్వో ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కొనుగోళ్లు చేపట్టాలి
- ధాన్యం సేకరణను కలెక్టర్లు పర్యవేక్షించాలి
- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం/ఎల్లారెడ్డి : ప్రణాళికాబద్ధంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సన్న బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం సేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. తాలు, తరుగు పేరు మీద రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించకుండా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని సూచించారు.

జిల్లాలో 446 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో 446 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయం నుంచి వీసీలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల గురించి మంత్రికి వివరించారు. 63 కేంద్రాల ద్వారా సన్న ధాన్యం సేకరిస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి 4.49 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం, 1.13 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 4,314 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం, 53,340 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కొనుగోలు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచామని, సౌకర్యాలు కల్పించామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, ఆర్డీవో ప్రభాకర్, డీఆర్‌డీవో సురేందర్, పౌర సరఫరాల సంస్థ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, డీసీవో రామ్మోహన్, మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

ఎల్లారెడ్డిరూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సక్రమంగా నిర్వహించాలని, అనర్హులకు ఇళ్లను మంజూరు చేయరాదని ఆదేశించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావాలన్నారు. ఆర్థికంగా వెనకబడిన వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం మంజూరు చేయాలని సూచించారు. రేషన్ కార్డుల సర్వే సైతం పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు విక్టర్, చందర్‌నాయక్, డీపీవో మురళి, డీఎల్‌పీవో సురేందర్, మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

57 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం

జిల్లాలో ఇప్పటివరకు యాసంగికి సంబంధించి 57వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. శనివారం ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. నూతనంగా వచ్చిన ప్యాడీ క్లీనర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే పనులు జరుగుతున్నాయన్నారు. కాంటాలు ప్రారంభంకాని చోట కాంటాలు ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు.

‘అనవసర రాద్ధాంతం చేస్తున్నారు’


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: వక్ఫ్ బోర్డు సంస్కరణల చట్టం విషయంలో ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర వక్ఫ్ సుధార్ జన జాగరణ్ అభియాన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి విమర్శించారు. శనివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ చట్ట సవరణ వల్ల ముస్లింలకు ఎలాంటి నష్టం జరగదన్నారు. వక్ఫ్ భూముల దుర్వినియోగాన్ని అరికడుతుందన్నారు. దేశంలో వక్ఫ్ ఆస్తుల ద్వారా భారీగా ఆదాయం వస్తున్నా 3 శాతం ముస్లింలు మాత్రమే వీటిని అనుభవిస్తున్నారని, 97 శాతం మందికి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాల రాజకీయ లబ్ధికోసం అసత్య ప్రచారం చేస్తున్నాయని, వారిని నమ్మవద్దని ప్రజలను కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాము, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, నాయకులు కుంట లక్ష్మారెడ్డి, నేహాల్, హారిక, బాలమణి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రైతులు తరలిరావాలి


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్‌లోని జీజీ కాలేజీలో సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న రైతు మహోత్సవానికి ఉమ్మడి జిల్లా రైతులు తరలిరావాలని డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి కోరారు. నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, సాంకేతిక విజ్ఞానం ద్వారా లాభసాటి వ్యవసాయం, రైతుకు అధిక దిగుబడి వచ్చే అంశాలు, డ్రోన్ వ్యవసాయం, వివిధ రకాల వంగడాలకు సంబంధించిన స్టాళ్లు ఉత్సవాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, గోర్కంటి లింగన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మా.. చల్లంగ చూడమ్మా..

మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా శనివారం బోనాల పండుగ జరుపుకున్నారు. రాత్రి బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం తిరుగుబోనాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగారపు ఎల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పున్న లక్ష్మణ్, కామిండ్ల కృష్ణ, పురుషోత్తం, రాజేందర్, సంతోష్‌కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు. – దోమకొండ


పెద్దమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కేవీఆర్


బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలుగ్రామాల పంచాయతీల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిరుపేదలకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెప్పారు. దీంతోపాటు రేషన్‌కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అర్హులకు మాత్రమే కార్డులు అందేలా సర్వే చేయాలన్నారు. డీపీవో మురళీ, ఎంపీడీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

11కేవీ లైన్ ఏబీ స్విచ్‌ల ఏర్పాటు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండలం సబ్ డివిజన్ పరిధిలోని శెట్పల్లిసంగారెడ్డి శివారులో శనివారం 11కేవీ లైన్ ఏబీ స్విచ్‌లు బిగించినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మల్లేశం తెలిపారు. శెట్పల్లిసంగారెడ్డి పరిధిలో 24, లింగంపేటలో 10, గాంధారిలో 18, సర్వాపూర్‌లో 6, మొత్తం 58 ఏబీ స్విచ్‌లు రన్నింగ్‌లో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వీటి ద్వారా 11కేవీ లైన్‌లో ఏమైనా సమస్యలుంటే అదే భాగాన్ని ఓపెన్ చేసి మిగతా 11కేవీలకు సప్లై ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏఈలు హరీష్‌రావు, సాయినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామంలో మత్తడి పోచమ్మ జాతర సందర్భంగా శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కుస్తీ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు హోరాహోరీగా తలపడ్డారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతానికి చెందిన మల్లయోధులు తమ కుస్తీలతో వీక్షకులను అలరించారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.బాన్సువాడ పోలీసులు, బందోబస్తు పర్యవేక్షించారు.

ప్రైవేటుకు దీటుగా విద్యా బోధన



భిక్కనూరు: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తాం...మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండని లక్ష్మీదేవునిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రజిత అన్నారు. శనివారం గ్రామంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయని, పుస్తకాలు కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. మాజీ ఉపసర్పంచ్ పరమేశ్వర్‌రెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయుడు రాంరెడ్డి, కాంప్లెక్సు హెచ్‌ఎం ప్రసూన, అంగన్‌వాడి టీచర్ సువర్ణ పాల్గొన్నారు.

భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



భూభారతిపై మీసాన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి: దశాబ్దాలుగా నెలకొన్న భూ సమస్యలు భూ భారతి చట్టం వల్ల పరిష్కారం కానున్నాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట, ఎల్లారెడ్డి మండలంలోని మీసాన్‌పల్లి రైతు వేదికలలో శనివారం భూభారతి అవగాహన సదస్సులకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణి స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించడానికే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూ భారతి చట్టంలో భూరిజిస్ట్రేషన్, భూ రికార్డుల్లో తప్పుల సవరణ, సాదాబైనామా దరఖాస్తులకు, వారసత్వంగా వచ్చిన భూముల దరఖాస్తులకు పరిష్కారం లభించనుందన్నారు. గతంలో ధరణిలో అప్పీల్‌కు ఆస్కారం లేనందున సివిల్ కోర్టుకు వెళ్లవలసి ఉండేదని, కాని ప్రస్తుత భూ భారతి చట్టం ద్వారా భూ రిజిస్ట్రేషన్లపై అభ్యంతరాలుంటే భూ యజమానులు ఆర్డీవో, కలెక్టర్, ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చని వివరించారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసి, గడిచిన 12 ఏళ్లుగా అనుభవంలో ఉంటూ 12.10.2020 నుంచి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీవో విచారణ చేసి అర్హత కల్గిన రైతుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్‌డ్యూటీ వసూలుచేసి సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. అదనపు కలెక్టర్ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్‌ఐ మహ్మద్, ఎల్లారెడ్డి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

డీఈవో రాజు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి రూరల్: విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరికీ ఉందని డీఈవో రాజు అన్నారు. శనివారం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో రాజు హాజరై ప్రసంగించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆట పాటల్లో ముందుండాలన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎంలు సాయిరెడ్డి, హన్మాండ్లు, సెక్టోరియల్ అధికారి నాగవేందర్, ఎఫ్‌ఏవో రమేష్, ఏసీజీ బలరాం, జీసీడీవో సుకన్య తదితరులు పాల్గొన్నారు.

'అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి'



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

ఎల్లారెడ్డిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని డీఆర్‌డీవో సురేందర్, ఐకేపీ సిబ్బందికి సూచించారు. ఎల్లారెడ్డి ఐకేపీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ఇంత వరకు 9వేల 927 మెట్రిక్ టన్నుల ధాన్యం 867 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని అన్నారు. రైతులకు ఇంత వరకు 13 కోట్ల 46 లక్షల రూపాయలు వారి ఖాతాలలో ధాన్యం డబ్బులను వేసినట్లు తెలిపారు. ఏపీఎం ప్రసన్న రాణి తదితరులున్నారు.

చారిత్రక కట్టడాల విశిష్టతపై అవగాహన



400 ఏళ్ల నాటి బురుజు వద్ద విద్యార్థినులు

దోమకొండ: ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గడికోట, బురుజు, ఉపగడ్డ తదితర చారిత్రక కట్టడాలపై శనివారం విద్యార్థులకు గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు కట్టడాలను ప్రత్యక్షంగా చూపించి వాటి విశిష్టతను తెలియజేశారు. గడికోట నుంచి బురుజు వరకు ర్యాలీగా వెళ్లి బురుజు కట్టడం దాని చరిత్ర వా రికి వివరించారు. గడికోట ట్రస్టు మేనేజర్ బా బ్జీ, ట్రస్టు ప్రతినిధులు గణేష్‌యాదవ్, రాజశేఖ ర్, హరీష్, కల్పన విద్యార్థులు ఉన్నారు.

బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మాచారెడ్డి: మేన మామను బ్లాక్ మెయిల్ చేస్తూ రూ. 40 లక్షలు డిమాండ్ చేసిన మేనల్లుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన జీడిపల్లి నరసింహారెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లు చేసి షట్టర్లను నిర్మించాడని తన మేనల్లుడు ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన గురిజాల మధుసూదన్‌రెడ్డి సోషల్ మీడియాతోపాటు పత్రికల్లో(సాక్షి కాదు) దుష్ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నావని మధుసూదన్‌రెడ్డిని అడిగిన నరసింహారెడ్డిని చంపుతానని బెదిరించి, తప్పుడు ప్రచారం చేయకుండా ఉండాలంటే రూ.40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెల్లారితే కొడుకు పెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి



నాగయ్య (ఫైల్)

రుద్రూర్: కొడుకు పెళ్లిని ఘనంగా నిర్వహించాలనుకున్న తండ్రి కానరాని లోకానికి వెళ్లిపోయాడు. భాజాభజంత్రీలు మోగాల్సిన ఇంట్లో రోదనలు మిన్నంటాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన తండ్రి గొర్ల నాగయ్య (52) కుమారుడి వివాహం ఆదివారం జరగాల్సి ఉంది. పోతంగల్ మండలం కారేగాం గ్రామంలో పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు నాగయ్య శనివారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. హంగర్గా ఫారం సమీపంలో బైక్‌కు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి చెట్టుకు ఢీకొన్నాడు. తీవ్రగాయాలైన నాగయ్యను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగయ్య మరణవార్త తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, నాగయ్య మిషన్ భగీరథలో హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కామారెడ్డి క్రైం: పిట్లం మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఎస్పీ రాజేష్ చంద్ర శనివారం సాయంత్రం కేసుకు సంబంధించిన వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ నెల 7న రాత్రి పిట్లం మండల కేంద్రంలోని నరసింహ జువెలరీ దుకాణంలో చోరీ జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు..సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని మద్నూర్‌కు చెందిన ఉప్పల్‌వారి శ్రీనివాస్‌గా గుర్తించారు.నిందితుడిని శనివారం అదుపులోకి తీసుకొని విచారించగా,నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి 22 గ్రాముల బంగారం,9.732 కి లోల వెండిని రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. కేసు ఛేదనలో కృషి చేసిన బాన్సువాడ సీఐ రాజేష్, పి ట్లం ఎస్సై రాజు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులకు సంబంధించి ఏప్రిల్‌లో విడుదలైన 1, 3, 5వ సెమిస్టర్స్, ఎల్‌ఎల్‌బీ 1, 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ప్రొఫెసర్ కే సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీవాల్యుయేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.500 లు, దరఖాస్తు ఫారానికి రూ.25 లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఈ నెల 26 వరకు రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్www. telangana university. ac. in ను సందర్శించాలని సూచించారు.

నేరాల నియంత్రణకు చర్యలు



వర్ని/రుద్రూర్: నేరాల నియంత్రణకు కఠినచర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య పేర్కొన్నారు. వర్ని, రుద్రూర్, కోటగిరి పోలీస్ స్టేషన్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసిప్షన్ సెంటర్, కంప్యూటర్ సిబ్బంది పని తీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో సౌకర్యా లు, సమస్యలపై ఆరా తీశారు. మత్తు పదార్థాలు, గంజాయి, గేమింగ్ యాప్స్, సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సైలు సాయన్న, మహేశ్ ఉన్నారు.

రైతు మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టే రైతు మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని జీజీ కాలేజీ గ్రౌండ్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

స్విమ్మింగ్‌పూల్‌లో యువకుడి మృతి

మృతుడు మెదక్ జిల్లా చేగుంటవాసి



తిరుపతి సంజయ్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రానికి చెందిన యువకుడు శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట మండల కేంద్రానికి చెందిన తిరుపతి సంజయ్ అలియాస్ లాల్ (21) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం దామరచెర్వులోని బంధువుల ఇంటికి వచ్చాడు. వారితో కలిసి పెద్దమల్లారెడ్డిలో ఉన్న ప్రైవేట్ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టేందుకు వచ్చాడు. ఈత కొడుతుండగా తలకు గాయమై ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే సంజయ్‌ను ఒడ్డుకు తీసుకొచ్చి 108లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, సంజయ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. తల్లి మంజుల ఉంది. మృతదేహాన్ని చేగుంటకు తరలించారు.

ఆటో బోల్తా.. విద్యార్థులకు గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఆటో బో ల్తా పడి విద్యార్థులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పెర్కిట్‌లోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు తరగతులు ముగించుకొని రోజూ మాదిరిగానే ఆటోలో మొత్తం 9 మంది ఇంటికి బయల్దేరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో సాత్విక్, శ్రీవల్లి అనే విద్యార్థులకు గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు విద్యార్థులకు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. డ్రైవర్ రోజూ టాటాఏస్ వ్యాన్ తీసుకువచ్చేరని అది రిపేర్‌కు వెళ్లడంతో ఆటో తీసుకొచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు మమత, వినోద్, సిద్ధు గాయపడిన విద్యార్థులను పరామర్శించారు.

కీచక ఉపాధ్యాయుడిపై మరో కేసు

రామారెడ్డి: పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చి బాధితులను బెదిరించిన ఉపాధ్యాయుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలోని ఓ పాఠశాలలో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు మహేశ్‌పై ఇటీవల విద్యార్థినులు షీటీంకు సమాచారం ఇచ్చారు. షీ టీం సభ్యులు విచారణ చేసి రెండ్రోజుల క్రితం మహేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటికి వచ్చిన మహేశ్ .. బాధితులను తీవ్రంగా బెదిరించగా శనివారం మరో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అపరిశుభ్ర హోటళ్లకు జరిమానా



తనిఖీలు చేస్తున్న బల్దియా అధికారులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లపై మున్సిపల్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్ సిబ్బందితో కలిసి నగరంలోని పలు హోటళ్లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న టీ హోటళ్లు అపరిశుభ్రంగా ఉండడంతో వారికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. కంఠేశ్వర్ బైపాస్‌లోని లహరి హోటల్‌లో పాడైపోయిన చికెన్‌ను గుర్తించి, నిర్వాహకులకు రూ. 10 వేల ఫైన్ వేశారు. ముబారక్‌నగర్, కుమార్ గల్లి, ఖలీల్‌వాడీల్లోని పలు హోటళ్లలో తనిఖీలు చేపట్టి రూ.45 వేల జరిమానా విధించినట్లు ఏఎంసీ జయకుమార్ తెలిపారు. వారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు షేక్ షాదుల్లా, కృష్ణ, జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

వరిధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం నజర్



గోర్గల్ కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. యాసంగి సీజన్‌లో సన్నరకం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తుండటంతో విక్రయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తోంది. శనివారం గోర్గల్ గ్రామ కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం విక్రయాలను రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం-3 ఓఎస్డీ శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓఎస్డీ వెంట డీఎస్పీ శేఖర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు సురేశ్, సీఐ, ఎస్సైలు, అచ్చంపేట సొసైటీ సీఈవో సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్: మాచాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం ప్రసన్నరాణి శనివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, విద్యుత్, త్రాగునీరు, టెంట్ సౌకర్యాలు కొనుగోలు పూర్తయ్యే వరకు ఉంచాలని అన్నారు.

తడిసిన ధాన్యం తరలింపు

రామారెడ్డి: కన్నాపూర్‌లో గురువారం కురిసిన వడగండ్ల వానకు ధాన్యం కొనుగోలు కేంద్రంలోని 1100 సంచుల ధాన్యం తడిశాయి. వెంటనే విషయం తెలుసుకున్న సొసైటీ చైర్మన్ మర్రి సదాశివ రెడ్డి సివిల్ సప్లయ్స్ అధికారులతో మాట్లాడి తడిసిన ధాన్యం కాంటా చేసి రైస్‌మిల్‌కు తరలించారు. వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లక్ష్మా గౌడ్, సీఈవో బైరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలి



బంజరతండాలో రైతులతో అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల వివరాలకు సంబంధించి ట్యాబ్‌ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి సూచించారు. గోపాల్‌పేట, బంజరతండా, ధర్మారెడ్డి, తాండూర్ గ్రామాల్లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యంలో తేమశాతం, తూకం సేకరణ ప్రక్రియను వారు పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు లక్ష్మయ్య, శ్రీనివాస్, అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి సుదర్శన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ(టీజీఈజేఏసీ) ఉద్యమ కార్యాచరణలో భాగంగా కేంద్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా జేఏసీ నాయకులు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల 57 సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోవడంతో దశలవారీగా ఉద్యమబాట పట్టినట్టు జేఏసీ జిల్లా చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి వివరించగా.. తాను తప్పకుండా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. జేఏసీ సెక్రటరీ జనరల్ ఆర్.దేవేందర్, వివిధ సంఘాల నాయకులు పి.శ్రీనివాస్‌రెడ్డి, బాబు, నాగరాజు, సాయిరెడ్డి, బి.రాజు, హన్మంతురెడ్డి, దేవులా, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

న్యాయవాదుల సహకారం మరువలేనిది



జడ్జి పద్మావతిని సన్మానిస్తున్న బార్ సభ్యులు

ఖలీల్‌వాడి : జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో న్యాయవాదుల సహకారం మరువలేనిదని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో బార్ అధ్యక్షుడు మామిల్ల సాయారెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగరీత్యా బదిలీపై వచ్చానని, బదిలీపై వెళ్లడం సహజమని, పదవికి న్యాయం చేశామా లేదా అనేదే ముఖ్యమని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ తరపున కక్షిదారులకు న్యాయ సేవలు అందించడంలో అగ్రస్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. బార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సాయారెడ్డి, మాణిక్ రాజు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లను విజయవంతం చేయడంలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. అనంతరం జడ్జి పద్మావతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు దిలీప్, సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణ దాసు, లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అందించండి

- రోడ్డు ప్రమాదంలో పడకల్ యువకుడికి తీవ్ర గాయాలు
- చికిత్సకు సుమారు రూ.6లక్షల వరకు అవసరం
- దాతల కోసం బాధిత కుటుంబ సభ్యుల ఎదురుచూపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆకాశ్

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన యువకుడు పసుల ఆకాశ్ ఈ నెల 11న బైక్‌పై వస్తుండగా నూర్‌సింగ్ తండా వద్ద మరో వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆకాశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని సరోజిని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్‌లోని నరాలు చిట్లిపోయాయని, కుడి కన్ను పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. ఆపరేషన్ కోసం రూ. 6లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అంత స్థోమత లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్నారు.

పోలీస్ ఉద్యోగం రాకపోవడంతో ఇడ్లీ సెంటర్‌తో ఉపాధి..

ఆకాశ్‌కు భార్య మౌనిక, ఐదేళ్ల లోపు పాప, ఓ బాబు ఉన్నారు. ఆకాశ్ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగం కోసం కొంత వరకు అప్పులు చేసి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నాడు. కానీ ఉద్యోగం రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చాలన్న ఉద్దేశంతో ఇటీవల కలిగోట్‌లో చిన్న ఇడ్లీ సెంటర్ ప్రారంభించాడు. ఇడ్లీ సెంటర్ ద్వారా వచ్చిన డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ అనుకోని పరిస్థితుల్లో ఆకాశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలు కావడంతో కుటుంబం దిక్కుతోచనిస్థితికి చేరింది. ప్రస్తుతం ఆకాశ్ పరిస్థితి విషమంగా ఉందని వెంటనే డబ్బులు సమకూర్చుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో ఆకాశ్‌కు మెరుగైన వైద్యం కోసం పడకల్ గ్రామస్తులు, యువకులు తమవంతుగా ఆర్థికంగా సహాయ సహకారాలు అందజేస్తున్నారు. మరికొంత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు. ఆర్థికసాయం చేయదల్చిన దాతలు ఆకాశ్ సోదరుడు పసుల రవి సెల్ నంబర్‌కు 91823 98298కు ఫోన్‌పే చేయగలరు.

పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలి



రైడ్స్ లోగో ఆవిష్కరిస్తున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్

రుద్రూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు ఆయా పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. రుద్రూర్ హైస్కూల్‌లో 1965 నుంచి 2015 వరకు చదివిన విద్యార్థులతో రైడ్స్ (రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ)ని ఏర్పాటు చేయగా.. అందుకు సంబంధించిన లోగోను జేటీసీ శనివారం ఆవిష్కరించారు. అనంతరం రైడ్స్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. రైడ్స్ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడంపై సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రైడ్స్ కార్యక్రమాలకు మామిండ్ల రామాగౌడ్ స్మారక ట్రస్ట్ అండగా ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడంతోపాటు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రైడ్స్ ద్వారా తోడ్పాటు అందిస్తామన్నారు.